ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.7 । కనిష్ఠం 19.4





తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న శేర్‌శంకర్ తండావాసులు

రేపు గురుకులాల సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ఎల్లారెడ్డి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో మిగిలిన సీట్ల కోసం మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఎల్లారెడ్డి ప్రిన్సిపాల్ ఇన్‌చార్జి డీసీవో నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన 2025-26 విద్యా సంవత్సరం కోసం జిల్లాలోని ఎల్లారెడ్డి, భిక్కనూర్, దోమకొండ, పెద్ద కొడపుగల్, బిచ్కుంద (అచ్చంపేట), లింగంపేట, ఉప్పల్‌వాయి, ఎక్లార, కొయ్యగుట్ట, బాన్సువాడ తాడ్కోల్‌పై పాఠశాల కళాశాలలలో సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు వివరించారు. అర్హత గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు జిరాక్స్ సేట్లతో ఉదయం 9 గంటలలోపు ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో హాజరు కావాలన్నారు.

సాధు సంత్ మహరాజ్ జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

కామారెడ్డి రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో శ్రీ సాధు సంత్ మహరాజ్ జిల్లా అధ్యక్షుడిగా నలావత్ రాజు, ఉపాధ్యక్షుడిగా గంగారాం, ప్రధాన కార్యదర్శిగా రామావత్ సేవ్య, కోశాధికారిగా బానోత్ గోపి, ప్రచార కార్యదర్శిగా బానోత్ రాజు, కార్యదర్శిగా నూనవత్ బావ్‌సింగ్ ఎన్నికయ్యారు.



నిజాంసాగర్‌కు.. జలకళ



నిజాంసాగర్ ప్రాజెక్టుపై పర్యాటకుల సందడి



గుల్‌గస్తి గార్డెన్లలో పర్యాటకుల సందడి

- ప్రాజెక్టులో 1400 అడుగులకు చేరిన నీటి మట్టం
- మంజీరా వెంట 50,500 క్యూసెక్కుల వరద
- సింగూరు ఐదు వరద గేట్ల కొనసాగింపు
- 43,634 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల
- నిజాంసాగర్ ప్రాజెక్టుపై సందర్శకుల సందడి

నిజాంసాగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల రైతాంగానికి కల్పతరువైన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం నాటికి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంజీరా వెంటనే 50 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి సామర్థ్యం క్రమేపీ పెరుగుతూ ఉంది. 1405 అడుగులకు గాను 1400 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం 17.802 టీఎంసీలకు గాను 12.353 టీఎంసీల నీరు సామర్థ్యం నిలువ ఉంది. సింగూరు ప్రాజెక్టులో ఐదు వరద గేట్లను కొనసాగిస్తూనే ఉన్నారు. ఆ ప్రాజెక్టు నుంచి 43,634 క్యూసెక్కుల నీటిని దిగువ మంజీరాలోకి వదిలి వేస్తూ ఉన్నారు. సింగూరు ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా 40,821, జెన్కో గేట్ల ద్వారా 2180 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు క్రమేపీ నిండుతుండడంతో పర్యాటకుల సందడి కనబడుతోంది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంజీరా వెంట వరద వస్తుండడంతో నీటి మట్టం పెరుగుతోంది. ఈ నీటిని చూసేందుకు పర్యాటకులు వస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పరిస రాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బం దులు పడుతున్నారు. నేడో, రేపో నిజాంసాగర్ నీటి మట్టంపై అధికారులతో ఈఈ సోలోమెన్ సమీక్ష నిర్వహించనున్నారు. కాగా నిజాంసాగర్ బ్యాక్ వాటర్ లొల్లి తెరపైకి రానుంది. నాగిరెడ్డిపేట మండలం పరిధిలో మంజీరా వెంట ఉన్న గ్రామాల రైతుల పంట భూములు మునిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజాంసాగర్ వరద గేట్లను ఎత్తివేయాలని అధికారులకు ఫోన్‌ల ద్వారా విన్నవిస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు అధికారులు 29.917 టీఎంసీలకు గాను 20.910 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని నిలువ (మిగతా 8వ పేజీలో)

ఘనంగా తీజ్ వేడుకలు

రాజంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని శేర్‌శంకర్ తండాలో ఆదివారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం సంప్రదాయ పద్ధతిలో నిర్వహించే తీజ్ పండుగ ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటామని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు గోధుమ విత్తనాలను బుట్టలో పెట్టి పెళ్లికాని యువతులతో తమ ఆరాధ్య దేవతలకు మొక్కులు చెల్లించుకుంటామని తెలిపారు. చివరి రోజున నృత్యాలతో ఊరేగింపు నిర్వహించి చెరువుల్లో నిమజ్జనం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్‌రాంనాయక్, రాజు నాయక్, భాస్కర్, సేవ్యానాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతంపల్లి వీడీసీ నూతన కార్యవర్గం ఎన్నిక

భిక్కనూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అంతంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా పిట్ల రాములు, ఉపాధ్యక్షుడిగా జీడి సిద్ధయ్య, కోశాధికారిగా బస్వ రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లుగా వలకొండ అమృతారెడ్డి, రాంరెడ్డి, గోల్కొండ నర్సింహారెడ్డి, కుంట రమేష్ రెడ్డి, పిట్ల శ్రీను, నాయికొల్ల సిద్ధరాములు, పుల్లూరి చంద్రం, మైలారం రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా పాటుపడుతామని అన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న దృశ్యం

పారిశుధ్య పనుల పరిశీలన

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని మాచాపూర్(పెద్దారెడ్డి) గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి మురళి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని వీధుల్లో పర్యటించి మురికికాలువలను, చెత్త చెదారాన్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. పారిశుధ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఎలాంటి రోగాల బారిన పడకుండా ఉంటారని, ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా కాపాడుతూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తే గ్రామంలో పారిశుధ్యం ఎంతో బాగుంటుందన్న విషయాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామస్థులకు వివరించాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. నిర్మాణాలను వేగవంతంగా చేపట్టాని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రకాష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



సిద్ధరామేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సిద్ధరామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

భిక్కనూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర ఆలయంలో శ్రావనమాస చివరి ఆదివారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే భక్తులు జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిజామాబాద్, సిద్దిపేట, హైదరాబాద్, మెదక్ జిల్లాల నుంచి భక్తుల పెద్దఎత్తున చేరుకుని మూలబావి వద్ద స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా స్వామి వారిని బీజేపీ సీనియర్ నాయకులు మురళీధర్‌గౌడ్ దర్శించుకుని మొక్కులు తీర్చుకోగా ఆలయ అర్చకులు ఆయనను ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ఉగ్రవాయి మైసమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

- ప్రతీ ఆదివారం అమ్మ వారికి ప్రత్యేక పూజలు

కామారెడ్డి రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామ శివారులో గల ఉగ్రవాయి మైసమ్మ ఆలయంలో ఆదివారం అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని కుంకుమార్చనలు, హారతి, ఓడి బియ్యం వంటి పూజ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా చేపట్టారు. అమ్మ వారిని దర్శించుకోవడానికి చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాకుండా సమీపంలోని జిల్లాల నుంచి భక్తులు చేరుకొని అమ్మ వారిని దర్శించుకుంటే కోరుకున్న కోరికలు నెరవుతాయని తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న సంతాన నాగదేవ, పుట్ట ఎల్లమ్మ, పెద్దమ్మ తల్లి ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జన్నార్ధన్‌రెడ్డి, సిబ్బంది, భక్తులు తదిరులు పాల్గొన్నారు.

జోరుగా జూదం



ఓ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు(ఫైల్)

- సరిహద్దు ప్రాంతాల్లో పేకాట స్థావరాలు
- ఇటీవల పలు మండలాల్లో పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు
- మండల, గ్రామాల్లో పంట పొలాలు, అటవీ ప్రాంతాలు
- పట్టణాల్లో హోటళ్లు, అద్దె ఇళ్లలో, అపార్ట్‌మెంట్లలో అడ్డాలు
- పేకాటరాయుళ్లకు ప్రజాప్రతినిధుల అండదండలు
- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు

కామారెడ్డి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దు ప్రాంతాలతో పాటు అటవీ, మారుమూల గ్రామాల్లో, హోటల్‌లు, అద్దె ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో రహస్యంగా పేకాట అడ్డాలను ఏర్పాటు చేసి జూదం జోరుగా నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లా సరిహద్దు మండలాలతో పాటు పెద్ద ఎత్తున గ్రామాల్లో, పట్టణాల్లో పేకాట స్థావరాలపై పోలీసు అధికారులు దాడులు చేయడమే ఇందుకు నిదర్శనం. జిల్లాలో ఎప్పటి నుంచో జోరుగా పేకాట కొనసాగుతున్నా స్థానిక పోలీసులు మాత్రం దాడులు చేయకపోవడంపై పలు విమర్శలకు తావివ్వగా ఎస్పీ రాజేష్‌చంద్ర ప్రత్యేక దృష్టి సారించడంతో ఎక్కడికక్కడ పేకాటరాయుళ్ల పట్టుబడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉండే కొందరు ప్రజా ప్రతినిధులు, నాయకులు పేకాట నిర్వాహకులకు అండగా ఉంటూ వారితో కలిసి పేకాట ఆడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్థానిక పోలీసులకు ముడుపులు అందిస్తు పేకాట నిర్వయిస్తూ వచ్చారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఆయా పోలీసు స్టేషన్‌ల అధికారులు దాడులు చేయడం లేదని నిఘా వర్గాలు సైతం అనేక సార్లు పేర్కొన్నాయి. ఎస్పీ రాజేష్‌చంద్ర జిల్లాకు వచ్చినప్పటి నుంచి క్రమశిక్షణ తప్పిన, నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న వారికి హెచ్చరికలు జారీ చేయడంతో పాటు అలసత్వం వహిస్తున్న వారిపై చర్యలు సైతం తీసుకుంటున్నారు. దీంతో అధికారులు సైతం పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడమే ఆలస్యం వెంటనే దాడులు చేస్తూ పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని కట్టడికి ప్రయత్నాలు చేస్తున్నారు.

సరిహద్దు మండలాలు, గ్రామాలే అడ్డా

జిల్లాలోని సరిహద్దు మండలాలైన జుక్కల్, పిట్లం, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్, మద్నూర్, బిచ్కుంద, నస్రూల్లాబాద్, బీర్కూర్, భిక్కనూరు, బీబీపేట, రామారెడ్డి, కామారెడ్డి తదితర మండల్లాలోని పరిసరాల ప్రాంతాల్లో పేకాట జోరుగా కొనసాగుతోంది. ఈ మండలాల పరిధిలోని రహస్యమైన ప్రదేశాలతో పాటు అటవీ ప్రాంతాల్లో మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో రహస్య స్థలాన్ని ఎంపిక చేసి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తు పేకాటరాయుళ్లు, నిర్వాహకులు ఏజెంట్లుగా వ్యవహరిస్తు పోలీసులు, ప్రజాప్రతినిధులు మా చేతిలోనే అంటూ జోరుగా పేకాట కొనసాగిస్తున్నారు. జూలై 13న ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామ శివారులో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.4500ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 7న మద్నూర్ మండలంలోని పెద్దషెకర్‌గా, డోంగ్లీ మండలంలోని మదన్‌హిపర్గాలో పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేశారు 20 మందిని అదుపులోకి తీసుకుని రూ.34వేల నగదును సీజ్ చేశారు. పిట్లం మండల కేంద్రంలో పేకాట స్థావరంపై దాడి చేయగా 4,320 నగదు స్వాధీనం చేసుకుని పలువురిని అరెస్టు చేశారు. ఈనెల 6న బాన్సువాడని ఎన్‌జీవోస్ కాలనీలో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. వీరిలో పలువురు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, వ్యాపారులు ఉన్నట్లు సమాచారం. 15 రోజుల కిందట బాన్సువాడ మండలంలోని సంగోజీపేటలో ఆరుగురు జూదం ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. 20 రోజుల

(మిగతా 8వ పేజీలో)

రైతు సంక్షేమమే భారతీయ కిసాన్ సంఘ్ ధ్యేయం

జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి



జాతీయ కిసాన్ సంఘ్‌లో మాట్లాడుతున్న కిషన్ సింగ్ ప్రతినిధులు

రామారెడ్డి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే భారతీయ కిసాన్ సంఘ్ ధ్యేయమని జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. రామారెడ్డి మండలం పోసానిపేట్ రైతువేదికలో ఆదివారం కిసాన్ సంఘ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. రైతు పంట పొలాల్లో సాగు చేస్తున్న పంట విషయాలు గురించి చర్చించారు. ఏ కాలంలో ఏ పంటలు సాగు చేయాలని లక్ష్యంగా తీసుకొని పంటలు పండించాలన్నారు. అన్ని గ్రామాల గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు నారెడ్డి రాజిరెడ్డి అధ్యక్షత నిర్వహించారు. రైతుల సంక్షేమం కోసం రైతుల పక్షాన పంటల పక్షాన పోరాడినప్పుడే విజయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం పార్టీలు వేరైనా రైతుల సంక్షేమం కోసం కలిసి కట్టుగా పని చేయాలని జాతీయ కిసాన్ సాంగ్ పెద్దలు, ప్రతినిధులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైని నగేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబి ఆనంద్ రావు, రాష్ట్ర సంఘటన మంత్రి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉత్తునూరులో ఉట్టికొట్టే కొట్టేందుకు సిద్ధంగా ఉన్న యువకులు

ఉత్తునూరులో ఘనంగా ఉట్టికొట్టే కార్యక్రమం

సదాశివనగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలంలోని ఉత్తునూరు గ్రామంలో ఆదివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉట్టి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మందిరం నుంచి ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అంగడిబజార్‌లో యాదవ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉట్టిని, కండెరాయ ఆలయంలో వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉట్టిని గ్రామ యువకులు సాహసోపేతంగా కొట్టారు. దీనికి బహుమతిగా యాదవ యూత్ రూ.2వేలు, వీడీసీ రూ.5వేలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రావు, ఉపాధ్యక్షుడు చిన్న వీరన్న, కోశాధికారి రమేష్, యాదవ సంఘం సభ్యులు గోగునూరి బాలయ్య, కరికాడ రాజు, కొత్తగొల్ల శ్రీను, మోతె రాజు, కొత్తగొల్ల శివ, లక్ష్మీపతి, పరమేష్, పబ్బ రార్తిక్, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులనే..

కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న అశోక్‌జీ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర స్వదేశీ జగరణ మంచ్ రాష్ట్ర సహ సంయోజక్ అశోక్‌జీ అన్నారు. ఆదివారం కామారెడ్డిలో ఏర్పాట్లు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్ఠం చేసి ట్రంప్ టారీఫ్‌లకు సమాధానం ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బయ్‌కాట్ చైనా, అమెరికా, టర్కీ నినాదంతో పని చేస్తూ దేశభక్తిని చాటాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ అనిశ్చితులు చెల్లింపు విధానాలు, వ్యాపార మార్గాలు, కరెన్సీలు, ఆయుధాలుగా మారుతున్నాయన్నారు. చైనా వంటి దేశాలు అధిక ఉత్పత్తులు చేసి తక్కువ ధరలకు నాసిరకమైన వస్తువులను డంప్ చేసి తయారీ రంగాన్ని బలహీనపరుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బొర్ర రాజాగౌడ్, రాహుల్, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న ఎస్సై

హనుమాన్ ఆలయంలో హుండీ చోరీ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ హనుమాన్ ఆలయంలో హుండీ చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. హుండీలో ఉన్న నగదుతో పాటు హుండీని అమాంతంగా దొంగిలించుకోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో దేవునిపల్లి ఎస్ఐ రంజిత్ ఆలయం వద్దకు చేరుకుని చోరీకి సంబంధించిన వివరాలు నమోదు చేసుకున్నారు. దాదాపు రూ.20వేల వరకు నగదు ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

చర్చ్ వరల్డ్ మీడియా ప్రతినిధిగా దాస్ ఎల్లం

దోమకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):హౌజ్ ఆఫ్ బిషప్ ఇండియా మీటింగ్ అబాయ్డింగ్ ఆఫ్ చర్చ్ నెల్లూరు, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన 70 మంది బిషప్‌లు పాల్గొన్న కార్యక్రమంలో కామారెడ్డి జిల్లాకు చెందిన బిషప్ డాక్టర్ జీవై దాస్ ఎల్లం ఏసీఈ డయాసిస్ చర్చ్ వరల్డ్ మీడియా ప్రతినిధిగా నియామాకమ్యారు. ఆయన భారతదేశంలో పలు రాష్ట్రాల్లో చేసిన సేవలను గుర్తించి నియమించినట్లు దాస్ ఎల్లం తెలిపారు. తనపై నమ్మకంతో చర్చ్ వరల్డ్ మీడియా ప్రతినిధిగా బలపరచి ఆమోదించిన ప్రమట్ ఆర్చ్ బిషప్ డాక్టర్ విజయ్ మోహన్‌రావ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

బోధన్,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శర్బత్ కెనాల్ చౌరస్తా, బస్ డిపో వెనుక వాహనాలు ఎక్కువగా నడవడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఆదివారం మున్సిపల్ అధికారులు కంకర పౌడర్‌తో గుంతలను పూడ్చారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ జాదవ్ చిప్స్ డస్ట్‌తో మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పాయి. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ శరత్ రెడ్డి, మున్సిపల్ ఏఈ శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నాగేపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నవీపేట,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి):మండలంలోని నాగేపూర్‌లో నవగ్రహ విగ్రహప్రతిష్టాపన ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీ రామాలయంలో నూతనంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు.రెండు రోజులపాటు జరిగే ఉత్సవాలలో భాగంగా మొదటిరోజైన ఆదివారం గణపతిపూజ, పుణ్యావచనం, దేవతా హవాహన పూజలు, హోమం, జలాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం,అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నారు.ఈకార్యక్రమంలో బినోల పురోహితులు కృష్ణ ప్రసాద్ జోషి, విగ్రహాలదాత జ్యోతి లక్ష్మీనారాయణగౌడ్, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.



నాగేపూర్‌లో విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

క్రైం సమాచారం

నల్లవెల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం



ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన గుర్తుతెలియని దుండగులు

ఇందల్వాయి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నల్లవెల్లి గ్రామంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి ధ్వంసం చేశారు. 25 కెవి ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్, ఆయిల్‌లను ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు ట్రాన్స్‌కో అధికారులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

నవీపేట,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అభంగపట్నంలో ఆదివారం సాయంత్రం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన మంత సుదర్శన్ బైక్‌పై నవీపేట నుండి గ్రామం వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వెంటనే బాధితుడిని ప్రైవేటు వాహనంలో నిజామాబాద్ ఆసుపత్రికి తరలించడం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

ఆలూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన రవితకు ఆదివారం ఉదయం పురిటి నొప్పులు అధికం కావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో రవిత పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది తక్షణమే ప్రథమ చికిత్స అందించి దేగాం పీహెచ్‌సీకి తరలించారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. సాధారణ ప్రసవానికి సహకరించిన 108 సిబ్బంది ఈఎంటీ శాంత, పైలెట్ రమేష్, ఆశవర్కర్లకు మహిళ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



ప్రసవించిన బిడ్డను చూపుతున్న ఆశవర్కర్, ఈఎంటీ

అన్ని దానాలలో రక్తదానం గొప్పది



రక్తదానం శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

భీమ్‌గల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాలలోకెల్లా రక్తదానం గొప్పదని ఆర్మూర్ శ్రీలక్ష్మీనర్సింహా ఫీవర్ హాస్పిటల్ వైద్యులు భానురామగిరి అన్నారు.ఆదివారం భీమ్‌గల్‌లోని సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో యోగా మిత్రమండలి ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వారు పాల్గొని వైద్యసేవలు అందించారు. అనంతరం డాక్టర్ భాను మాట్లాడుతూ రక్తదాన ప్రాణధారంతో సమానమని రక్తదానం చేసి మరో మనిషి బ్రతికించడం గొప్ప విషయం అన్నారు. ఆర్మూర్ ప్రాంతంలోని మారుమూల గ్రామాల వారు ప్రమాదాల పాలై రక్తం అవసరం వచ్చినప్పుడు జిల్లా కేంద్రానికి వెళ్లవల్సి వచ్చేదని వీరి ఇబ్బందులు గమనించి ఆర్మూర్‌లో ప్రాణదారం పేరిట బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి ఆపదలో ఉన్నవారికి ఇక్కడే రక్తం అందిస్తున్నామన్నారు. భీమ్‌గల్ యోగా మిత్ర మండలి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురికి ఉచితంగా వైద్య సేవలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భాను, డాక్టర్ బసంత్‌రెడ్డిలను మిత్ర మండలి సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూపాల్, భూమయ్య, అనంత్‌రావు, ఇచ్చేం రవికుమార్, నర్సారెడ్డి, సాయిచరణ్ పాల్గొన్నారు.

చినుకు పడితే.. రోడ్లు చిత్తడే..

- అడపా దడపాగా కురుస్తున్న వర్షాలు
- మురికి కాలువలుగా మారిన ప్రధాన కూడళ్లు
- సర్కస్ ఫీట్లు చేస్తున్న పాదచారులు



నందిపేట-బజార్ కొత్తూర్ మెయిన్ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

నందిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీలలో నందిపేట ఒకటి. మండలంలోని ప్రతీ గ్రామం వ్యవసాయం మీదనే ఆధారపడి ఉంది. ప్రతీ కాలంలో వేల ట్రిప్పుల పంటల ధాన్యాలను ఇతర మండల, జిల్లాలకు తరలిస్తారు. ఎప్పుడు రద్దీగా ఉండే రోడ్లు మాత్రం బాగాలేవు. అడపా, దడపాగా కురుస్తున్న వర్షాలకు నందిపేటలోని మెయిన్ రోడ్డు, రాంనగర్, రాజానగర్ దుబ్బా ప్రాంతంలో రోడ్లు చిత్తడిగా మారాయి. ముందే పెద్ద పెద్ద గుంతలతో ఉన్న రోడ్లలో వర్షం నీరు చేరి అవికాస్త మరింత పెద్దవిగా తయారైనాయి. వాటి నుంచే పెద్ద పెద్ద వాహనాలు అధిక లోడులతో పోవడంతో చిన్న చిన్న కుంటలను తలపిస్తున్నాయి. నందిపేట మెయిన్ రోడ్డుపై నంది విగ్రహం చౌరస్తా నుంచి మసీద్ వరకు ఉన్న బీటీ రోడ్డుపై అన్ని గుంతలే ఏర్పడ్డాయి. ఆ గుంతలలో వర్షం నీరే కాకుండా మురికి నీరు చేరుతోంది. మరి కొన్ని చోట్ల ఇళ్ళ నుంచి మురికి నీరు రాగా, హోటల్ యజమానులు అదే గుంతలలో మురికి నీటిని తీసుకొచ్చి పోస్తున్నారు. సుమారు 20 సంవత్సరాల నుంచి ఆ రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. ఇటీవల సగం వరకు తారు రోడ్డు నిర్మించారు. నంది విగ్రహం నుంచి కొత్త బస్టాండ్ మీదుగా జామ మసీద్ వరకు తారు రోడ్డు వేయడం మరిచారు. పైగా రోడ్డు వెడల్పు చేస్తామని జేసీబీతో తవ్వించారు. ఆ రోడ్డుపై నుంచి పోవాలంటే ప్రయాణీకులు జంకుతున్నారు. ద్విచక్ర వాహన దారులు సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రధాన చౌరస్తాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి



మెయిన్ రోడ్డుపై నంది విగ్రహం-పాత బస్టాండ్ మధ్యలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి. అంతే కాకుండా అక్కడ మట్టిని పూర్తిగా తొలగించి సిమెంట్‌తో ఏపుగా రోడ్డును నిర్మించాలి. అప్పుడే నీళ్ళు నిలవకుండా ఉంటుంది. అలాగే ఐలమ్మ చౌరస్తా నుంచి బజార్ కొత్తూర్ వరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టే ముందు డబుల్ రోడ్డు నిర్మించాలి. ఎందుకంటే ప్రభుత్వ కార్యాలయాలు అన్ని ఆ ప్రాంతంలోనే ఉన్నాయి. రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి అక్కడక్కడ కల్వర్టులు నిర్మించాలి.

- గజీబీంకర్ జ్యోతి నారాయణ-టీడీపీ నాయకులు, నందిపేట



రాంనగర్‌లో రోడ్డు పరిస్థితి



నందిపేట మెయిన్ రోడ్డు ఏర్పడ్డ గుంతలు



కొత్త బస్టాండ్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

ప్రమాదకరంగా ప్రయాణం

- ● గుంతలయమంగా రోడ్డు ● పట్టించుకోని అధికారులు



ప్రమాదకరంగా ఉన్న గుంత



ఇబ్బంది పడుతున్న వాహనదారుడు

రెంజల్,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి నుండి సాటాపూర్ మీదుగా బోధన్ వెళ్లే రహదారి గుంతలయమవ్వడంతో ప్రయాణికులకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రధాన రహదారిపై ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. నెలలు గడిచిపోతున్న ఆర్ అండ్ బీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న ఫలితం లేదన్నారు., ప్రధాన రహదారి గుంతలమయమైన కూడా అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గుంతలమయమైన రోడ్లలో ప్రయాణం ఇబ్బందికరంగా తయారైంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ రోడ్డు మీదుగా ప్రయాణాలు సాగుతాయి. గత రెండు, మూడు నెలల నుండి అధికారులకు విన్నవించుకుంటున్న ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. చినుకు పడితే చిత్తడిగా మారిన రోడ్లంత గుంతలమయమైపోవడంతో వాహన రాకపోకలు ఇబ్బందికరంగా తయారైంది. ఇకనైన అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న గుంతలను త్వరగా పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్య సమాజ్ గోశాలలో యజ్ఞ మహోత్సవం



బోధన్‌లో యజ్ఞ మహోత్సవ దృశ్యం

బోధన్,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి):బోధన్ పట్టణంలోని ఆర్య సమాజ్‌లో ఆదివారం శ్రావణి వేద ప్రచార యజ్ఞ మహోత్సవం, చతుర్వేద పారాయణం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమాన్ ఓంప్రకాష్ యజ్ఞచార్య గారిచే యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ప్రజలకు ప్రవచనలు చేశారు. బుధవారం ప్రారంభమైన యజ్ఞ మహోత్సవం ఆదివారంతో ముగిసింది.ఆర్య సమాజ్ దయానంద గోశాలలో విశేషదేవయజ్ఞం, పూర్ణాహుతి, యజ్ఞంలో కూర్చున్న దంపతులకు ఆశీర్వాదలు, ప్రవచనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు,ఈ సందర్భంగా యజ్ఞ బ్రాహ్మశ్రీ ఓంప్రకాష్ యజ్ఞచార్య వేద ప్రచారికురాలు కవిత మాట్లాడుతూ ప్రజలు భక్తిభావాన్ని అలవర్చుకోవాలని, యజ్ఞ, మహోత్సవాల వల్ల అనేక శుభ ఫలితాలు కలుగుతాయన్నారు. ప్రజలు యజ్ఞ, హోమాది పట్ల ఆసక్తి చూపాలన్నారు. రాజుల కాలంలో యజ్ఞ, హోమాది కార్యక్రమాలు నిర్వహించేవారని ప్రస్తుతం యజ్ఞ, హోమాది కార్యక్రమాలు నిర్వహిస్తే కుటుంబంతో పాటు ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉంటారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్య సమాజ్ గోశాల నిర్వాహకులు ప్రదీప్ గుప్తా,లడ్డు శ్రీనివాస్‌లతో పలువురు దంపతులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శిథిలావస్థలో సహకార సంఘ భవనం



శెట్‌పల్లిలో శిథిలావస్థలో ఉన్న సహకార సంఘ భవనం

మోర్తాడ్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం పూర్తిగా చెడిపోయింది. భవనంలోని సగభాగం పగుళ్లు ఏర్పడింది. పై నుంచి పెచ్చులు ఊడిపడుతుండడంతో ఉద్యోగులు సగ భాగం లోని విధులు నిర్వహిస్తున్నారు. సగభాగం కులుతుం దన్న భయంతో తాళం వేసి ఉంచుతున్నారు. ఈ సహకార సంఘం పరిధిలో ధర్మోరా, శెట్‌పల్లి, దొన్కల్, తొర్లి గ్రామాలున్నాయి. అన్ని గ్రామాలలో రైతులకు ఎరు వులు అందుబాటులో ఉండేందుకు గోదాంలు నిర్మించారు. ఈ సొసైటీలో 1540మంది సభ్యులున్నారు. సొసైటీ ద్వారా రైతులకు రుణాలు అందజేశారు. కొత్త భవనం నిర్మించేందుకు అధికారులు నిధులు మంజూరు చేసి సహకరించాలని రైతులు కోరుతున్నారు.

భవన నిర్మాణానికి ప్రతిపానదలు పంపాం

శిథిలావస్థకు చేరినసొసైటీ భవనం స్థానంలో నూతన భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు పం పాం. త్వరలో నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉంది.

- రఘు, పీఏసీఎస్ కార్యదర్శి, శెట్‌పల్లి

పెంటాకలాన్ సొసైటీలో క్షీరాభిషేకం

బోధన్,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం పెంటాకలాన్ సహకార సంఘంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా సొసైటీ చైర్మన్ దొనకంటి రాజిరెడ్డి మాట్లాడుతూ తమ పదవి కాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడగించినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రెటరీ షేక్ బాబా, సొసైటీ సభ్యులు బుడిమె శివకుమార్, పోతారెడ్డి, రాము, ఆవుల సుబ్బారెడ్డి, కొండపల్లి గంగాధర్, పెంటాకలాన్ మాజీ సర్పంచ్ రమణ, గ్రామస్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న పాలకవర్గం

వృథాగా పోతున్న నీరు

- ● గొలుసుకట్టు చెరువులకు మళ్లించండి సారూ..
- ● ఎడపల్లి పెద్ద చెరువు ఆయకట్టు రైతుల ఆవేదన



నీరు వెళ్లే కాలువను పరిశీలిస్తున్న రైతులు

ఎడపల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి పులి చెరువు నుంచి పెద్దవాగులోకి వృధాగా పోతున్న వర్షపు నీటిని గొలుసు కట్టు చెరువులకు మళ్లించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. దీంతో సుమారు ఐదు గొలుసుకట్టు చెరు వులలో నీరు పుష్కలంగా నిండి సుమారు 15 వేల ఎకరా ల పంటసాగుకు ఈ సాగు నీరు ఉపయోగపడుతుందని స్థానిక రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో ఇదే రీతిన వాగులో వృదాగా నీరు పోకుండా ఈ నీటిని గొలు సుకట్టు చెరువులకు మళ్లించేవారని, ఈసందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికే పంట పొలాలు పొట్ట దశకు చేరు కున్నాయని, సాగునీటి వినియోగం దానికి సరిపడా అం దటం లేదని, ఇలా వృదాగా పోతున్న వర్షపు నీటిని ఈ గొలుసుకట్టు చెరువులకు మళ్లిస్తే రైతుల పంటలు పండుతాయని వారు పేర్కొన్నారు. సుమారు పది మంది రైతులు వృధాగా పోతున్న వర్షపు నీటిపై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా వాస్తవ పరిస్థితులను తెలుపుతూ వివరించారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇక్కడి పరి స్థితిని పరిశీలించి, తగు చర్యలు చేపట్టాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని మంగల్‌పాడ్, మోస్రా మండలంలో వర్షాలు కురిస్తే ఆ నీటితో పులిచెరువు వెంటనే నిండుతుందని,చెరువు నిండగానే నీరు వృదాగా పోకుండా పులిచెరువు రెండవ అలుగు వద్ద కాలువను ఏర్పాటు చేసి ఎడపల్లి పెద్ద చెరువుతోపాటు పెంటాకలాన్, పెగడాపల్లి గ్రామాల చెరువులు నిండేలా చర్యలు చేపట్టారన్నారు. దీంతో చెరు వులలో నీరు పుష్కలంగా ఉండేదని, గత ప్రభుత్వం చేప ట్టిన మిషన్ కాకతీయ పనులలో బాగంగా అలుగు ఎత్తు తగ్గించడంతో రెండవ అలుగు వరకు నీరు రాకముందే వర్షపు నీరు వాగులోకి వృధాగా పోతుందన్నారు. దీనికి తోడు ఇరిగేషన్ అధికారులు కాలువకు షట్టర్‌ను ఏర్పాటు చేసి దానిని తీయకుండా మూసి ఉంచడంతో వర్షపు నీరు వాగులోకి వృధాగా పోతుందన్నారు. ఈ విషయమై గతంలో ఎన్నో సార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. గొలుసుకట్టు చెరువులకు నీరు వెళ్లే కాలువ కూడా పూర్తిగా చెత్తతో పూడిక ఏర్పడిందని, కాలువ పూడిక తీసి వర్షపు నీరు వృధాగా వాగులోకి పోకుండా గొలుసు కట్టు చెరువులకు మళ్లిం చాలని రైతులు కోరుతున్నారు.

గొలుసుకట్టు చెరువుల కాలువ పూడికతీతకు ప్రతిపాదనలు పంపాం..

గొలుసుకట్టు చెరవులకు నీరు వెళ్లే కాలువలో ఉన్న ముళ్ల పొదలను తొలగించాం. పూడికతీతకు ప్రతి పాదనలు పంపాం, వర్షాలు తగ్గు ముఖం పట్టగానే కాలువ పూడికతీత పనులు చేపట్టి గొలుసుకట్టు కాలువ ద్వారా నీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

● కుశాల్ ఇరిగేషన్ శాఖ ఏఈఈ, ఎడపల్లి



ఎడపల్లి పులి చెరువు అలుగును పరిశీలిస్తున్న ఇరిగేషన్, పంచాయితీ రాజ్ అధికారులు (ఫైల్ ఫోటో)

ఆర్మూర్‌లోని మూడో వార్డులో శ్రమదానం



శ్రమదానం చేస్తున్న సంస్థ సభ్యులు

ఆర్మూర్,ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని మూడోవార్డులో మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం నిర్వహించారు. వార్డు పరిధిలోని శ్రీ మురళీకృష్ణ ఆలయం, నవనాథ బ్రాహ్మణ సేవా సంఘం ఆవరణలో సంస్థ సభ్యులు శ్రమదానం నిర్వహించి పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. ఆలయ ప్రాంగణాన్ని నీటితో శుభ్రం చేశారు. ఈకార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, సభ్యులు ప్రశాంత్, గణేష్, రాకేష్, కాలనీవాసులు రాజేశ్వర్‌రావు, పుష్కర్‌రావు, దిగంబరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అసిస్టెంట్ లైన్‌మెన్‌కు సన్మానం



లైన్‌మెన్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

ఆలూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆలూర్‌లో అసిస్టెంట్ లైన్‌మేన్‌గా విధులు నిర్వహిస్తు ఇటీవల ఉత్తమ అవార్డు పొందిన సందర్భంగా ఆదివారం ఆయనను గ్రామస్థులు సన్మానించారు. మండలంలో నిస్వార్థంగా పని చేస్తు ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్న నరేష్‌కు అవార్డు రావడం సంతోషకరమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లైన్‌మేన్ గంగాదర్, కల్లెం మోహన్, మల్లేష్, శ్రీనివాస్, మనీష్ నవీన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలు ఇలా ఉంటే సాగునీరు అందేదెలా



కాలువలో నిండిన పూడిక

డిచ్‌పల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలోని రైతాంగం సాగర్ కాలువల పూడికతీతపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. గత కొన్నేళ్లుగా సాగర్ కాలువ పూడిక తీత తీయకపోవడంతో ఆయకట్టు రైతాంగానికి సాగునీరు అందడం లేదని రైతుల గోడును జిల్లా కలెక్టర్ వెంటనే పట్టించుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



దూపల్లిలో నృత్యం చేస్తున్న చిన్నారులు

రెంజల్,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపల్లి గ్రామంలో ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకిలో శ్రీకృష్ణుడి విగ్రహంతో గ్రామంలో సంప్రదాయ నృత్యాలతో భజనల మధ్య ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలో కోలాటాలతో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉట్టి కార్యక్రమం యువకులు పాల్గొని ఉట్లను కొట్టి కృష్ణాష్టమి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు లింగన్న యాదవ్, శంకర్, మహాదేవ్, రవి, సాయిలు, నర్సయ్య, అశోక్, శ్రీనివాస్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కమ్మర్‌పల్లి,ఆగస్టు17:(ఆంధ్రజ్యోతి)మండల కేంద్రా నికి చెందిన విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు ఉల్లెంగల గంగాధర్ రచించిన జగజ్జనని పెద్దమ్మతల్లి, పితృతర్పణం పుస్తకాలను ఆదివారం ఆవిష్కరించారు.. ఈకార్యక్రమంలో సామితి ప్రియులు విశ్రాంత ఎంపీడీవో (మెట్ పల్లి) బాలిగంగాధర్ జ్యోతి ప్రజ్వలన గావించగా జగజ్జనని పెద్దమ్మ తల్లి పుస్తకాన్ని విశ్రాంత హెచ్‌ఎం సముద్రాల అమర్‌నాథ్‌చారి,పితృతర్పణం పుస్తకాన్ని విశ్రాంత హెచ్‌ఎం గంగాధర్ (అర్గుల్)ఆవి ష్కరించారు. ఈకార్య క్రమంలో సుధాసాహితి కళానిలయం అధ్యక్షుడు ఉల్లెంగల గంగాధర్, కార్యదర్శి మర్యాల నాగ భూషణం, సభ్యుడు లక్ష్మీనర్సయ్య, చవుటి నర్సయ్య,మధుసూదన్ యు సభిత, సైదు నర్సయ్య, సాగర్, పాల్గొన్నారు.



కామారెడ్డిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయ విగ్రహాలు



వినాయక విగ్రహాల అమ్మకాల జోరు!

- వివిధ రూపాల్లో ఆకట్టుకుంటున్న గణనాథులు
- ధరలను లెక్క చేయకుండా కొనుగోలు చేస్తున్న యువత
- పది రోజుల్లో వీధివీధిన కొలువు దీరనున్న వినాయకులు

కామారెడ్డి రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వచ్చిందంటే చాలు.. చిన్నారులు, యువతలో ఎంతో హడావిడి ఉంటుంది. చాలా రోజుల ముందు నుంచే గణనాథుల విగ్రహాల వేటలో పడతారు. మరో పది రోజుల్లో జిల్లాలో ప్రతీ వీదివీదిన కొలువుదీరనన్నాయి. ఎలాంటి విగ్రహం కొనాలి? ఎక్కడ కొనాలి? ఎంత ధరలో కొనాలి? అనే ప్రశ్నాలు వారిని వెంటాడుతుంటాయి. గతంలో హైదరాబాద్ ప్రాంతానికే పరిమితమైన విగ్రహాల తయారీ నాలుగైదు సంవత్సరాల నుంచి కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ తదితర మండలాల్లో హైదరాబాద్‌కు దీటుగా విగ్రహాలు తయారు చేస్తుండడంతో యువత స్థానిక కొనుగోలు కేంద్రాల వైపే మొగ్గు చూపుతున్నారు. గతంలో గ్రామంలో ఒక్కటి, రెండు గణనాథులు మాత్రమే నిలిపే వారు. ఇప్పుడు వార్డుకు రెండు నుంచి మూడు వరకు గణనాథులను నిలుపడంతో విగ్రహాలు సైతం ఎక్కువ మొత్తంలో అమ్మకాలు జరుగుతున్నాయి. రాజాస్థాన్, కలకత్త నుంచి వచ్చిన కళాకారులు కామారెడ్డిలోనే విగ్రహాల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో కంటే తక్కువ ధరలకే అందిస్తూ వారు ఉపాధి పొందుతూ మరో 50 మందికి పైగా ఉపాధి చూపుతున్నారు. రాజస్థాన్‌కు చెందిన కళాకారులు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ రోడ్డు పక్కన సిరిసిల్లా రోడ్డు, టేక్రియల్ రోడ్డ, సరంపల్లి రోడ్డు పక్కన వినాయక విగ్రహాల తయారీని చేపడుతున్నారు. కలకత్తా నుంచి వచ్చిన కళాకారులు మట్టి వినాయక భారీ విగ్రహాలను సిరిసిల్లా రోడ్డులో తయారు చేస్తున్నారు. అదే విధంగా కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం పక్కన, సిరిసిల్లా రోడ్డు, కొత్త బస్టాండ్ పక్కన వివిధ ప్రాంతాల నుంచి తెప్పి గణేష్ విగ్రహాలను విక్రయిస్తున్నారు. భార్య పిల్లలతో వచ్చి విగ్రహాల తయారు కేంద్రాలను కామారెడ్డిలో ఏర్పాటు చేయడంతో కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ, సిరిసిల్లా, ఎల్లారెడ్డిపేట్, గంబీరావుపేట్, ప్రాంతాల నుంచే కాకుండా కామారెడ్డి డివిజన్ పరిదిలోని మండలాలు, గ్రామాల ప్రజలు గణేష్ మండళ్ల నిర్వహకులు తయారీ కేంద్రాలకు వచ్చి అందుబాటులోనే విగ్రహాలు రంగు రంగుల డిజైన్లతో అందుబాటులో ఉండడంతో కొనుగోలు చేపడుతున్నారు.

గణేష్‌ల అమ్మకాలు బాగానే ఉన్నాయి..
: ఆకుల రాజు, వ్యాపారి, కామారెడ్డి



గత 25 సంవత్సరాల నుంచి గణేష్‌ల వ్యాపారం చేస్తున్నాను. ప్రతీ ఏడాది వేరైటి డిజన్లుతో రావడంతో యువత అసక్తి చూపుతున్నారు. వినాయక ప్రతిమలు కొనుగోలు దారులకు నచ్చే విధంగా ఉండాలని దూర ప్రాంతాల నుంచి తెప్పిస్తున్నాం. దీంతో వినాయకులు అమ్మకాలు బాగానే జరుగుతున్నాయి.

వర్షాలతో కొంత వ్యాపారం తగ్గింది..
:పేటెరి శ్రీనివాస్, వ్యాపారి, కామారెడ్డి



గతంలో ఇప్పటి వరకు 80 శాతం వినాయకులను అమ్మె వారిమి. కానీ ఈ సారి వర్షాలు కురుస్తుండడంతో అమ్మకాలు మెల్లగా 60 శాతం వరకు అమ్మము. ప్రతి సంవత్సరం సిరిసిల్లా రోడ్డులో బైపాస్ సమీపంలో షేడ్ 05 పిట్ల నుంచి 20 పిట్ల వరకు అన్ని రకాల వినాయకులను తయారి చేయించాం.

నిండుకుండలా ఎస్సారెస్పీ

- ప్రాజెక్టులోకి లక్షా 51వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రధాన కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా మెండోర మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా కనువిందు చేస్తోంది. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి, పరిసరా ప్రాంతాల నుంచి వరద భారీగా చేరడంతో జలకలను సంతరించుకుంది. ప్రాజెక్టులోకి లక్షా51వేల806 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం నిలకడగా ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఇందిరమ్మ వరద గేట్లను ఎత్తి 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 4000 క్యూసెక్కులు, అలీసాగర్ 180 క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి కోసం 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు(805 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1086.30 అడుగుల(64.036 టీఎంసీలు)కు చేరింది. గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్టులో 1081.20 అడుగుల(48.295) టీఎంసీల నీటి నిల్వ ఉంది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటినిల్వ ఇలా..



కందకుర్తి త్రివేణి సంగమం వద్ద పూర్తిగా నీట మునిగిన శివాలయం

కందకుర్తిలో నీట మునిగిన శివాలయం

రెంజల్: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం నీటి మట్టంతో కళకళలాడుతోంది. ఎగువ ప్రాంతమైన విష్ణుపురి, బాబ్లీ ప్రాజెక్టుల నుంచి అధికంగా నీరు వచ్చి చేరుతోంది. హరిద్ర, మంజీర, గోదావరి నదుల వెంబడి నీటి తీవ్రత అధికమవ్వడంతో నది ఒడ్డున పురాతన శివాలయం పూర్తిగా నీట మునిగింది. చుట్టు పక్కల ప్రజలు తరలివచ్చి గోదావరి నది అందాలను తిలకిస్తున్నారు. గత కొన్ని రోజుల క్రితం నీరు లేక వెలవెలబోయిన గోదావరి నది భారీ వర్షాల నేపథ్యంలో అధిక నీరు వచ్చి చేరడంతో గోదావరి నది కొత్త కళ సంతరించుకుంది.

మంజీరా నదికి పెరిగిన వరద..

కోటగిరి: మంజీరా నదికి వరద ఉధృతి పెరిగిందని, పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోతంగల్ తహసీల్దార్ గంగాధర్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువ పరీవాహక ప్రాంతం నుంచి భారీగా వరద వస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఏ క్షణంలోనైనా ఎత్తే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే మంజీరా నదిలో వరద ప్రవాహం పెరిగిందని గేట్లు ఎత్తిన వెంటనే మరింత ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్నారు. నది పరీవాహక ప్రాంతంలోకి పశువులు, గొర్రెలు, చేపలు పట్టేవారు, రైతులు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



పోతంగల్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరా నది



అలుగు పారుతున్న బర్ధిపూర్ చెరువు

నిండిన బర్ధిపూర్ చెరువు

డిచ్‌పల్లి: నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని బర్ధిపూర్ కోణం చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగుపారుతోంది. చెరువు పూర్తిస్థాయిలో నిండిపోవడంతో ఆయకట్టు పరిధిలోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈయేడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో వేసిన పంటలకు ఎలాంటి డోకా లేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి వ్యక్తి మృతి

నవీపేట, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మండలం మల్కాపూర్(ఏ) పంచాయతీ పరిధిలోని లక్మాపూర్‌కు చెందిన గుడిమెట్ల శంకర్(45) అనే వ్యక్తి చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడని ఎస్ఐ తిరుపతి తెలిపారు. శంకర్ గ్రామంలోని టెంట్‌హౌస్‌లో కూలి పని చేసేవాడని, ఈ నెల 15న సాయంత్రం మండలంలోని అనంతగిరిలో చింతల చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోగా అతడి మృతదేహం ఆదివారం పైకి తేలిందని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి కుమారుడు కార్తీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సాలూరలో గ్రంథాలయం కోసం స్థల పరిశీలన చేస్తున్న దృశ్యం

గ్రంథాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

- 30లక్షల నిధుల కోసం ప్రతిపాదనలు
- జిల్లా గ్రంథాలయల సంస్థల చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి

సాలూర, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలో నూతన హంగులతో గ్రంథాలయ భవన నిర్మాణం కొరకు జిల్లా గ్రంథాలయల సంస్థల చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ఆదివారం సాలూరలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. నూతన గ్రంథాలయం నిర్మాణం కొరకు స్థల పరిశీలన చేశారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సాలూరలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని గ్రంథాలయాలు నిరుద్యోగ యువతకు అన్ని విధాలుగా దోహదపడతాయన్నారు. నిరుద్యోగ యువత గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివి పోటీ పరీక్షలకు సన్నద్ధమై ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. గ్రంథాలయ భవనం నిర్మాణం కొరకు 30లక్షల రూపాయల నిధుల మంజూరు కొరకై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సోసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇల్తెపు శంకర్, సోసైటీ సీఈవో బస్వంత్ రావు, గ్రామపెద్దలు కేజీ గంగారాం, ఎత్తిపోతల పథకం చైర్మన్ శివకాంత్ పటేల్, లక్ష్మణ్ గౌడ్, సొక్కం రవి, కన్నె రమేష్, సుభాష్, శ్రీకాంత్‌లతో గ్రామస్థులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు బీమా.. ఇన్స్యూరెన్స్‌తో ధీమా

- వాహనదారులు బీమా చేయించడంలో నిర్లక్ష్యం చేయొద్దు

బోధన్, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ద్విచక్ర వాహనం నిత్యావసరమైంది. సైకిళ్లు పోయి రోడ్లపై ద్విచక్ర వాహనాల సంఖ్య పెరిగింది. ఏ ఇంట్లో చూసిన ఆయా కంపెనీలకు చెందిన ఏదోక మోటార్ సైకిల్ తప్పకుండా ఉంటుంది. పట్టణ, గ్రామాలు అని తేడా లేకుండా వీటి వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. కొందరు నిత్యావసరం కోసం కొనుగోలు చేస్తే మరికొందరు ఫ్యాషన్ హోదా కోసం వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. కొత్త కొత్త మోడల్‌ను వినియోగిస్తూ పాతవాటిని అమ్మేస్తుంటారు. అయితే ఎటువంటి వాహనానికైన బీమా చేయించుకోవడం తప్పనిసరి. బీమాను ప్రోత్సహించేందుకు, కొత్త వాహనాన్ని కొనుగోలు చేసేటప్పుడు ప్రతి వాహనానికి కంపెనీ అమ్మకందారులు ఒక సంవత్సరం పాటు బీమా కల్పిస్తారు. సంవత్సరం తరువాత బీమా చేయించడంలో వాహనదారులు నిర్లక్ష్యం వహిస్తారు. ఫలితంగా ప్రమాదాలు, చోరీలు జరిగినప్పుడు పలు ప్రయోజనాలకు దూరమవుతుంటారు. బీమా లేకపోవడంతో ప్రమాదాల్లో గాయాలపాలైన వారికి లక్షల రూపాయల్లో నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చి తీవ్రంగా నష్టపోతున్నారు. బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు విరివిగా రుణాలు ఇవ్వడంతో ద్విచక్ర వాహనాల కొనుగోలు పదిరెట్లు పెరిగాయి.



- బీమా ఎంతో సులభం

వాహనాలకు పలు ప్రభు త్వ రంగ సంస్థలు ప్రయి వేటు కంపెనీలు బీమా సౌక ర్యాన్ని కల్పిస్తున్నాయి. కొత్త వాహనాలు కొనుగోలు చేసిన ప్పుడు తరువాతైన బీమా చేసుకునే అవకాశం ఉంది. గడువు తీరనున్న వారం ఒకరోజు ముందే వాహనం సిబుక్, బీమా కట్టిన ధ్రుకరణ పత్రం బీమా కార్యాలయానికి తీసు కెళితే వాహనాన్ని చూసి బీమా సదు పాయాన్ని కల్పిస్తారు. గడువు తీరిన తరు వాత యధావిధిగా వాహనాన్ని తీసుకెళ్లాల్సి వస్తుంది. వాహనం స్థితిని చూసి ప్రీమియం కట్టించుకుని బీమా సౌకర్యం కల్పిస్తారు. వాహనం చోరీకి గురైన, ప్రమాదంలో దెబ్బతిన్న పోలీసులతో పాటు బీమా కంపెనీకి ఫిర్యాదు చేయాలి. పోలీసులు ఇచ్చే ఎఫ్ఐఆర్ కాపీ ఆధారంగా బీమా అధికారి పత్రాలను పరిశీలిస్తారు. వాహనం చోరీకి గురైన, ప్రమాదంలో దెబ్బతిన్న భాగాలను బట్టి నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుంది. నడుపుతున్న వాహనం వేరొకరిని ఢీకొని గాయాలైన ప్రాణ నష్టం వాటిల్లిన థర్డ్ పార్టీ కింద నష్టపరిహారాన్ని పొందవచ్చు ఒకే బీమా సంస్థలో ప్రతియేడాది బీమా చెల్లించుకుంటే చెల్లించే ప్రీమియంలో రాయితీ ఉంటుంది. వాహనదారులార ఆలస్యం ఎందుకు మరి మీ వాహనానికి బీమా ప్రీమియం చెల్లించండి. సురక్షితంగా బీమా పొందండి.

బీమా ఉందని ధీమాగా ఉంది..
: లక్ష్మణ్ చౌహాన్, బోధన్



ఇటీవలే కొత్త వాహనాన్ని కొన్నాను. కంపెనీ యజమానులు ఇన్సూరెన్స్ చేయించారు. బీమా సౌకర్యం ఉందని ధీమాగా ఉంది. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే బీమా పథకం ఉంది. బీమాతో ఎంతో ప్రయోజనం.

బీమా చేయించుకోవాలి..
: ఎంవీఐ శ్రీనివాస్, బోధన్



ద్విచక్ర, కారు, తదితర వాహన యజమానులు తప్పకుండా తమ వాహనాలకు బీమా చేయించుకోవాలి. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినపుడు ఇన్సూరెన్స్ పథకం వాహనదారులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతి సంవత్సరం బీమా చేయించుకోవాలి.

పొచ్చెర జలపాతానికి సందర్శకుల తాకిడి

బోథ్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద ఆదివారం జలపాతం అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలివచ్చారు. అయితే జలపాతం వద్ద ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా అటవీ శాఖ అధికారులు అనుమతులు నిలిపివేశారు. దీంతో విషయం తెలియని ఇతర జిల్లాల పర్యాటకులు భారీసంఖ్యలో జలపాతం వద్దకు చేరుకున్నారు. అనుమతులు లేవని సిబ్బంది పేర్కొనడంతో కొద్దిసేపు సందర్శకులు వాగ్వాదానికి దిగారు. చివరకు సందర్శకుల ఒత్తిడిని తట్టుకోలేక సాయంత్రం జ లపాతం అందాలను చూసేందుకు అనుమతులు ఇచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో జలపాతం అందాలను తిలకించే ఒదుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చారు. వాహనదారులు రోడ్డుపైనే తమ వాహనాలను నిలిపివేశారు. దీంతో కొ ంతమంది కాలినడకన వెళ్లి జలపాతం అందాలను తిలకించవచ్చారు.



మోర్తాడ్‌లో ప్రభుత్వ పాఠశాలలో చదివి 45 ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకున్న పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

- 45 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మోర్తాడ్, ఆగస్టు17: (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1980-81 విద్యాసంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 45 ఏళ్ల తర్వాత అందరు ఒకచోట చేరి ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆనంద డోలికల్లో మునిగి తేలారు. ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నర్సయ్య సార్‌ను శాలువలు కప్పి జ్ఞాపికలను అందజేసి ఆశీర్వాదాలు అందుకున్నారు. కాగా, స్వర్గసులైన ఉపాధ్యాయలు సాటి విద్యార్థులను గుర్తు చేసుకుంటు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. కష్టనష్టాలో భాగస్వాములమవుతూ ఒకరికొకరం సహకారాలు అందజేసుకుంటూ ప్రతీఏడాది అందరం కలుసుకుని అపూర్వ సమ్మేళనంలో పాల్గొనాలని ఈ సందర్భంగా వారు నిర్ణయం తీసుకున్నారు.



ఘనంగా తీజ్ పండుగ

డొంకేశ్వర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నికాల్‌పూర్‌లో బంజారాల సంప్రదాయ తీజ్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు గోదుమ మొలకలను వేసి 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు మహిళలు తీజ్ దేవున్ని కొలుస్తు ఊరేగింపుగా వెళ్లి మొలకలను చెరువులో నిమజ్జనం చేశారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సమితి మండల అధ్యక్షుడు భీమ్‌నాయక్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్‌సుమాన్, బంజారాలు పాల్గొన్నారు.

తీజ్‌పండుగలో పాల్గొన్న మహిళలు, బంజారాలు

శ్రీరాం తండాలో..

నవీపేట,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాన్ ఫారం పంచాయతీ పరిధిలోని శ్రీరాం తండాలో ఆదివారం సాయంత్రం తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గిరిజన బాలికలు, యువతులు తొమ్మిది రోజుల పాటు నిష్టగా పెంచిన గోదుమ మొలకలతో కూడిన బుట్టలను తలపై పెట్టుకుని స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. అంతకు ముందు గిరిజన సంప్రదాయ పాటలు పాడుతూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.



శ్రీరాం తండాలో తీజ్ పండుగ నిర్వహిస్తున్న దృశ్యం

భిక్కనూరులో చైన్ స్నాచింగ్

భిక్కనూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో కండక్టర్ సీటు పక్కన కూర్చున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని ఒక వ్యక్తి పుస్తెలతాడును లాక్కొని వెళ్లిన సంఘటన భిక్కనూరు మండలం బంజర్ల గ్రామం వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన తోగరి భాగ్యలక్ష్మీ ఉదయం కామారెడ్డికి వెళ్లి తిరిగి రాత్రి గ్రామానికి రావడానికి కామారెడ్డి బస్టాండ్‌లో బస్సు ఎక్కి కండక్టర్ సీటు పక్కన కిటికీ వైపు కూర్చుంది. గుర్తుతెలియని వ్యక్తి అదే బస్సులో దోమకొండ బస్టాండ్‌లో ఎక్కి బంజర్ల టికెట్ తీసుకున్నాడు. బంజర్ల గ్రామ స్టేజీ వద్ద బస్సు ఆగగానే అతడు దిగి కిటికీ పక్కన కూర్చున్న భాగ్యలక్ష్మీ మెడలో నుంచి రెండు తులాల పుస్తెలతాడును లాక్కొని పక్కనే ఉన్న వంటపొలాల నుంచి పారిపోయాడు. లబోదిబోమంటు బాధితురాలు దొంగ దొంగ అని అరవగా బస్సులో ఉన్న వారు బస్సు దిగి చూసే సరికి చీకట్లో ఎవరూ కనబడలేదు. దీంతో బాధితురాలు 100కి ఫోన్ చేసి జరిగిన సంఘటన వివరించింది. వెంటనే విషయం తెలుసుకున్న ఎస్సై ఆంజనేయులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పుస్తెల తాడును ఎత్తుకెళ్లిన వ్యక్తి పింక్ కలర్ షర్ట్ వేసుకున్నట్లు బాధితురాలు తెల్పగా దోమకొండ, పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పోలీసులు జల్లెడ పడుతున్నారు.

ప్రజలు మంజీరా నది వైపు వెళ్లొద్దు

బీర్కూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. అయితే సోమ లేదా మంగళవారం సాగర్ ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి, మంజీర నదిలోకి వదిలే అవకాశం ఉందన్నారు. మంజీరా నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మంజీరా నది వైపు వెళ్ళదని సూచించారు. రెవిన్యూ, పోలీస్ శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మంజీరా నది పరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడానికి గ్రామాలలో దండోరా వేయించాలని కోరారు. మంజీరా నదీ పరివాహక ప్రాంతంలోకి రైతులు, పశువులు, గొర్రెల కాపరులు, చేపల వేటకు వెళ్లేవారు నది వైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం

మాచారెడ్డి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీనర్సింహా స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందజేసినట్లు ఆలయ సిబ్బంది, అర్చకులు ఆదివారం తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సిల్వర్ సౌజన్య-లింబాద్రి దంపతులు రూ.11 వేలు, సిల్వర్ వరేన్య-హితేష్ రూ.5100లను అందజేయగా వారిని ఆలయ అర్చకులు, సిబ్బంది సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజరాజేశ్వర ఆలయ అభ్యివద్ధికి విరాళం

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని వెల్లుట్ల గ్రామ శివారులో గల రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి సందర్శించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో జరుగుతున్న శ్రావణమాస ఉత్సవాల్లో ఎల్లారెడ్డి పాల్గొన్ని ఆలయ అభివృద్ధికి రూ.2లక్షలను విరాళంగా అందజేయడం జరిగిందన్నారు. ఈ మేరకు గ్రామస్థులు ఎల్లారెడ్డిని సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేష్, గంగాధర్, క్రాంతికుమార్, సాయిరెడ్డి, నరేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నర్వలో బోరుమోటారు ప్రారంభం

మహమ్మద్‌నగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో నీటి సమస్యతో బాధపడుతున్న గంగపుత్ర కాలనీలో బోరుమోటారును ఆదివారం జహీరాబాద్ బీజేపీ పార్లమెంట్ బీజేపీ నాయకులు డాక్టర్ పైడి ఎల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తమ కాలనీలో సమస్య ఉందని చెప్పగానే ఎల్లారెడ్డి వెంటనే నూతన బోరు వేయించి బోరుమోటారును బిగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంప్రసాద్ గుప్తా, గోరుగంటి రాములు, మహారాజు రాజాగౌడ్, మంద సాయిరెడ్డి, లక్ష్మారెడ్డి, అంజయ్య, సాయిలు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం

దోమకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): దోమకొండ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం పద్మశాలి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఐరేని నర్సయ్య, దోమకొండ మండల అధ్యక్షుడు బత్తిని సిద్ధరాములు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మ్యాక నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ఐరేని రాజేందర్, బొమ్మెర ప్రవీణ్, కుందెన వినోద్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మెర గంగాధర్, కోశాధికారిగా అందె గణేష్, నారాయణ, సహాయ కార్యదర్శులుగా కూచని జగదీష్, శ్రీగాధ మహదేవ్, చాట్ల అనీల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకముంచి ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘంలోని ప్రతిఒక్కరిని కలుపుకుని సంఘం అభివృద్ధికి ముందుకు సాగుతామన్నారు.

జోరుగా జూదం

(5వ పేజీ తరువాయి)

కిందట బాన్సువాడ పట్టణంలోని పార్క్ రోడ్డులో 5 గురు పేకాట ఆడుతుండగా పోలీసులు పట్టుకున్నారు. రెండు రోజుల కిందట ఎల్లారెడ్డి మండలంలోని ఓ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువురిని అరెస్టు చేశారు.

హోటళ్లు, అద్దె ఇళ్లు, అపార్ట్‌మెంట్లే అడ్డాలు

జిల్లాలో పేకాట నిషేధం ఉన్నప్పటికీ పేకాట నిర్వాహకులు, జూదం ప్రియులు ప్రత్యేక అడ్డాలను ఏర్పాటు చేసుకుంటూ దర్జాగా కొనసాగిస్తున్నారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడి పట్టణాల్లోనూ దాదాపు పేకాట క్లబ్బులను పోలీసులు మూసి వేయించారు. దీంతో పేకాట ప్రియులు పట్టణాల్లోని అపార్ట్‌మెంట్లు, అద్దె ఇళ్లు, హోటళ్లు, లాడ్జీలు, దాబాలతో పాటు శివారు ప్రాంతాల్లో ప్రతినిత్యం గుట్టుచప్పుడు కాకుండా ఆడుతున్నారు. క్లబ్బులు బంద్ కావడంతో జూదరులు రోజుకో అడ్డాను మారుస్తున్నారు. ఈ అడ్డాలకు పేకాట ఆడడానికి వచ్చే వ్యక్తులను ఆట ముగిసేంత వరకు బయటకు వెళ్లకూడదనే నిబంధన పెడుతూ నిర్వాహకులు పేకాటను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. హోటళ్లలో ఉండే రూమ్ రెంట్‌కు అదనంగా రెండు మూడింతలు డబ్బులు చెల్లిస్తూ నాలుగైదు రూమ్‌లను బుక్ చేసుకుని పేకాట నిర్వాహకులు దర్జాగా నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఎక్కడ తనిఖీలు చేస్తారోనని జాగ్రత్త పడుతూ రోజురోజుకూ హోటళ్లలో అడ్డాలను మారుస్తున్నారు. ఇక లాడ్జీల్లో పోలీసులు తనిఖీలకు వచ్చారంటే చాలు సంబంధిత మేనేజర్లు, అందులో ఉండే బాయ్‌ల ద్వారా పేకాట రాయుళ్లకు సమాచారం చేరవేయడంతో పేకముక్కలను దాచేసి అక్కడ మద్యం తాగుతున్నట్లు మద్యం బాటిళ్లు, గ్లాసులు పెట్టుకుని ఉంటున్నారు.

పేకాటలోనూ పలువురు ప్రజాప్రతినిధులు

పేకాటరాయుళ్లకు ప్రజాప్రతినిదులు వత్తాసు పలకడమే కాకుండా పేకాట నిర్వహించేవారు పోలీసుల పేరిట కేటీ వసూలు చేస్తు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా పరిధిలోని పలు మండలాల్లో గ్రామాల్లో రహస్యమైన ప్రదేశాల్లో కాకుండా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకుల ఇళ్లలో పేకాటరాయుళ్లు లక్షల రూపాయలు పెడుతూ పేకాట కొనసాగిస్తున్నారు. ఒక్కో ఆటకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఈ ప్రాంతాల్లోని కీలకమైన ప్రజాప్రతినిధులు కూడా ఈ పేకాటలో పాల్గొంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. రాజకీయ నాయకులు పేకాట ఆడుతూ పట్టుబడిన సంఘటనలు గతంలో చాలానే ఉన్నాయి. ఈ ప్రాంతాలకు చెందిన మండల, గ్రామీణ స్థాయి ప్రజాప్రతినిధులు అక్రమార్జన కోసమే పేకాటను కొనసాగిస్తునే ఉన్నారు.



భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్సై ఆంజనేయులు



మద్నూర్‌లో..

గణేష్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

దోమకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై స్రవంతి అన్నారు. ఆదివారం ఆమె దోమకొండలో గణేష్ మండప నిర్వాహకుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైన ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సైలు శ్రీనివాసులు, జానీ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట: వినాయక చవితి పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రాజంపేట ఎస్సై దత్తాద్రిగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గణేష్ మండపాల నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పండగలో డీజేకు అనుమతి లేదని, నిమజ్జనం రోజున సీరియల్ ప్రకారం వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్, బాల్‌రాజు, రాజేష్, చరణ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: రానున్న పండుగలను మండల ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ అరుణ్ కుమార్ సూచించారు. ఆదివారం రైతు వేదికలో మండలంలోని శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో వినాయక చవితిని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల నిర్వహకులు ఆన్‌లైన్ ద్వారా విగ్రహ ప్రతిష్ఠాపనకు అనుమతి తీసుకోవాలన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన మొదలుకుని నిమజ్జన కార్యక్రమం వరకు జాగ్రత్తగా ఉండి నిర్వాహకులు ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంగారాం, సహకార సంఘం అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి, మాజీ ఎపీపీ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మత రసామరస్యంగా ప్రజలు పండుగలు జరుపుకోవాలని మద్నూర్ ఎస్సై విజయ్‌కొండ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ తహసీల్దార్ ముజీబ్, ట్రాన్స్‌కో ఏఈ గోపికృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్, ఫైర్ అధికారులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: వినాయక చవితి ఉత్సవాల్లో మండప నిర్వాహకులు నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు అన్నారు. ఆదివారం భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో మండలంలోని వినాయక మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని, విద్యుత్‌కు సంబంధించిన పనులు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సంఘ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలి



కార్యకర్తల ఉద్దేశించి మాట్లాడుతున్న విభాగ్ సంపర్క ప్రముఖ

మద్నూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ శాంతి సమృద్ధి కోసం సామరస్యతతో కూడిన సంఘటిత శక్తిగా శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఆర్ఎస్ఎస్ విభాగ్ సంపర్క ప్రముఖ కోటూరి శ్రీధర్ అన్నారు. ఆదివారం మద్నూర్ మండల కేంద్రంలో జరిగిన మూడు మండలాల రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ సంక్షేమం అనే లక్ష్యంతో ఒక సుదీర్ఘమైన మరపురాని యాత్రలో నిమగ్నమై తేజోవంతమైన మాతృ శక్తి సహా, సాధుసంతులు, ధర్మాచార్యులు, మహాపురుషుల ఆశీర్వాదముతో రాష్ట్రీయ స్వయంసేవక్ శతాబ్ది పూర్తి చేసుకుందని గుర్తు చేశారు. జాతీయ జీవనంలో ప్రవేశించి అనేక దోషాలను తొలగించి భారతదేశాన్ని ఒక సంఘటిత, శీలసంపన్న, శక్తివంతమైన దేశంగా పరమ వైభవ స్థితికి తీసుకెళ్లడానికి పూజ్యనీయ డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ 1925లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ కార్యాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. నిత్య శాఖ రూపంలో వ్యక్తిత్వ వికాసం కోసం ఒక విశిష్ట కార్య పద్ధతిని అభివృద్ధి చేశారని అన్నారు. నిత్య శాఖ ద్వారా సంపాదించిన సంస్కారాలతో సంఘము 100 సంవత్సరాల ప్రయాణంలో సమాజం యొక్క అంచలంచలమైన నమ్మకాన్ని మరియు ప్రేమను సంపాదించుకున్నదని అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తలు మాన అవమానాలకు, రాగద్వేషాలకు అతీతంగా ప్రేమ ఆత్మీయతల ఆధారంగా అందరినీ కలుపుకొని వెళ్లే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవహ సంతోష్, ఖండ కార్యవాహ సంజయ్ జూబ్రే, కార్యకర్తలు స్వయం సేవకులు పాల్గొన్నారు.

సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

బీర్కూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానం సన్నిధిలో సాక్షి సిద్ధి వినాయక ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. టీటీడీ కొండ దిగువ భాగంలో స్వాగత తోరణం వద్ద గత తొమ్మిదేళ్ళ క్రితం సిద్ధి వినాయక ఆలయం నిర్మించారు. ఆదివారం నాటికి తొమ్మిదేళ్లు పూర్తికావడంతో ఈ సందర్భంగా వార్షికోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, యజ్ఞయాగాది, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత ఉప్పలపాటి వెంకటరావు దంపతులు చేతుల మీదగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గోవింద్, ఆనంద్, ఆలయ కమిటీ సభ్యులు నరసరాజు, అప్పారావు, తిమ్మాపూర్ గ్రామ పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

మద్నూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో బౌ... బౌ అరుపు వింటేనే వీధుల్లో జనం పరుగులు తీస్తున్నారు. గ్రామ సింహాలు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మద్నూర్ మండలంలోని పెద్ద తడుగూర్‌లో ఆదివారం నలుగురికి కుక్క కరవడంతో కుటుంబీకులు వారిని మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. వారిలో పార్వతీభాయి, దాదారావు, సంజు, అనిల్, మద్నూర్ మండలంలో కుక్కల బెడద ఎక్కువైంది. వీధుల్లో నడుస్తున్నప్పుడు ఎప్పుడు కరుస్తాయో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీధుల్లో రాకపోకలు సాగించటానికి జంకుతున్నారు. గతంలో డోంగ్లీ మండలం ఇలేగావ్ గ్రామాలు పిచ్చికుక్క ఇద్దరు చిన్నారులను కరవడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గత ఏడాది మద్నూర్ మండల కేంద్రంలో గంగారాం అనే వ్యక్తిని కుక్క కరిచింది. జనవరిలో ముగ్గురిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఆరు నెలల క్రితం మండలంలో డోంగ్లి, మే నూర్,పెద్ద ఎక్లార, లచ్చన్, మొగ, ధోతీగ్రామాల్లో పలువురిపై కుక్కలు దాడి చేశాయి. సుల్తాన్ పేట్ బాధితులు ఉన్నారు. సమస్య ఇంత తీవ్రంగా ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదన్న ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పార్వతీభాయి కాలుకు గాయమైన దృశ్యం

వికసించిన బ్రహ్మకమలం

నిజామాబాద్‌కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లోని వినాయక్‌నగర్‌లో అరుదైన బ్రహ్మకమలం విక సించింది. ప్రతీ సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వా తావరణ పరిస్థితిని బట్టి బ్ర హ్మకమలం వికసిస్తుంది. స్థా నిక వినాయక్‌నగర్‌లో నివాసం ఉంటున్న పార్థసారధి ఇంట్లో బ్రహ్మకమలం వికసించడంతో చుట్టుపక్కల వారు వచ్చి బ్రహ్మకమలాన్ని వీక్షించారు.



వికసించిన బ్రహ్మకమలం

బీర్కూర్‌లో వాహనాల తనిఖీ

బీర్కూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. రోడ్డు నిబంధనలు పాటించని 40 మంది వాహనదారులకు జరిమానాలు విధించినట్లు పోలీసులు తెలిపారు. ఒకరికి డ్రంకెన్‌డ్రైవ్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శాతవాహన సైనిక్ చీఫ్ జట్టు కోచ్‌గా ప్రశాంత్

సుభాష్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): యువ తెలంగాణ ప్రో కబడ్డీ శాతవాహన సైనిక్ చీఫ్ జట్టు కోచ్‌గా మీసాల ప్రశాంత్ నియమితులయ్యారు. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ సహకారంతో యువప్రో కబడ్డీలీగ్ చాంపియన్ షిప్ ఈనెల 27నుంచి సెప్టెంబరు 5వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రతిభ కనబర్చిన క్రీడాకారుల ను ఎంపిక చేసి 8జట్లుగా విభజించారు. జిల్లాకు చెందిన సీనియర్ కబడ్డీ క్రీడాకారులు డీఎస్ఏ కబడ్డీకోచ్ మీసాల ప్రశాంత్‌ను శాతవాహన సైనిక్‌జట్టుకు చీఫ్‌కోచ్‌గా నియమించారు.

అన్నాభావుసాఠే అడుగు జాడల్లో నడవాలి

జుక్కల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ అన్నాభావుసాఠేను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పిలుపునిచ్చారు. ఆదివారం జుక్కల్ మండలం హంగర్గ గ్రామంలో అన్నాభావు సాఠే విగ్రహాన్ని ఆవిష్కరించి అనంతరం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నేటి యువతీ యువకులు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు స్థిరపడాలని ఆయన అన్నారు. గతంలో అన్న బాబు సాఠి ఎంతో కష్టపడి మంచి మార్గాన్ని చూపించిన నేత అన్నాభావు సాఠే ఒక్కరేనని ఆయన అన్నారు. ఆయన చేసిన సేవలను కొనియారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను పోషిస్తూ ఇతరులను గౌరవించాలని ఆయన అన్నారు. హంగర్గా గ్రామస్థులు అన్నాభావు సాఠే విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషకర విషయమని గ్రామస్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొ న్నారు.



సాఠే విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



బాన్సువాడలో పార్కును శుభ్రం చేస్తున్న చిన్నారులు

స్వచ్ఛ సైనికులు

బాన్సువాడ డబుల్ బెడ్‌రూం జర్నలిస్ట్ కాలనీలోని పార్కులో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో చిన్నారులకు పార్కులో ఆటలాడుకునేందుకు వీలు లేకుండాపోయింది. ఆదివారం పాఠశాలకు సెలవు దినం కావడంతో చిన్నారు లందరూ స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్కులో ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేసుకున్నారు. అనంతరం సరదాగా ఆటలాడుకున్నారు.

- బాన్సువాడ టౌన్

నిజాంసాగర్‌కు జలకళ

(5వ పేజీ తరువాయి)

చేస్తూ వచ్చే వరద నీటిని దిగువకు వదులుతున్నారు.

పోచారం ప్రాజెక్టుపైకి సందర్శకులకు అనుమతి లేదు

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు వద్దకు పర్యాటకులు, సందర్శకులు వెళ్లకుండా పోలీసులు తగు చర్యలు చేపట్టారు. ప్రాజెక్టు పొంగి పొర్లుతున్నందున, ప్రాజెక్టు కట్టపై నుంచి ఉధృతంగా వరద నీరు అలుగు పారుతున్నందున ప్రాజెక్టు సందర్శనకు వచ్చే సందర్శకులకు, పర్యాటకులకు ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు పోలీసులు ఎవరికీ అనుమతించడం లేదు. ప్రాజెక్టు పొంగిపొర్లుతున్న సమయంలో ప్రాజెక్టు వద్దకు సందర్శకులను వెళ్లేందుకు అనుమతిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలను పోలీసులు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోచారం ప్రాజెక్టు ఇరువైపులా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు అటువైపు పోచం మరాల్ వద్ద మెదక్ జిల్లా హవేళీ ఘనపూర్ పోలీసులు పికెట్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఒక్కో పికెట్‌లో ఒక ఏఎస్సై, ఐదుగురు కానిస్టేబుల్‌లు ఉదయం నుంచి రాత్రి వరకు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు వద్దకు ఎవరు వెళ్లకుండా పోలీసులు తగు చర్యలు చేపట్టడంతో ప్రాజెక్టు సందర్శన కోసం వచ్చే సందర్శకులు దూరం నుంచి ప్రాజెక్టు పొంగి పొర్లుతున్న దృష్యాలను, ప్రాజెక్టు అందాలను తిలకిస్తూ ఆనందిస్తున్నారు.

పోచారం ప్రాజెక్టులో తగ్గుముఖం పట్టిన ఇన్‌ఫ్లో

పోచారం ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. శనివారం ప్రాజెక్టులోకి 12,867 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చింది. ఆదివారం ఉదయం 8163 క్యూసెక్కుల ఇన్ ఫ్లో రాగా సాయంత్రానికి 3954 క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని వివిధ మండలాలలో వర్షాలు తగ్గుముఖం పట్టడం కారణంగా ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతోంది.

కూలిపోయిన ఇళ్ల పరిశీలన

మహమ్మద్‌నగర్: మహమ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన ఇళ్లను ఏఎన్ఎం సులోచన, ఆశా వర్కర్ లక్ష్మీ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండవద్దని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జర్వాలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వచ్చి చెకప్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.



పోచారం ప్రాజెక్టుపై పోలీసుల పికెట్



హసన్‌పల్లిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న దృశ్యం



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - వార్-2
ప్రియా 70 - వార్-2
ప్రియా 35 - మహావతర్ నరసింహ

బాన్సువాడ

మహేశ్వరి - వార్ 2
వెంకటేశ్వర - కూలీ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

